# బడిపలుకులు భాష కావాలి

**కాళోజీ జయంతి సభలో వక్తలు**






వర్ధన్నపేట, సెప్టెంబర్ 9,(జర్నలిస్ట్ వార్త): పలుకుబడులు భాష కాదు, బడి పలుకుబడులు భాష కావాలని వరంగల్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్ అన్నారు. సోమవారం వర్ధన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గూళ్ళ వెంకటరమణ అధ్యక్షతన అభ్యుదయ రచయితల సంఘం వరంగల్ శాఖ ఆధ్వర్యంలో కాళోజీ జయంతి సందర్భంగా తెలంగాణ భాషాదినోత్సవాన్ని పురస్కరించుకున్నారు. ఈ కార్యక్రమానికి ఇంటర్మీడియట్ వరంగల్ జిల్లా విద్యాధికారి శ్రీధర్ సుమన్ ముఖ్య అతిథులుగా హాజరై కాళోజీ చిత్ర పటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలుకుబడులతో కూడిన భాష కాకుండా, బడి పలుకుల భాష సులభతర భాషా, అందరికీ అర్థమయ్యే రీతిలో ఉండాలన్నారు. అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పల్లేరు వీరస్వామి మాట్లాడుతూ ఉద్యమాలే ఊపిరిగా కాళోజీ తన జీవిత ప్రస్థానం సాగించిన మహనీయులని అన్నారు. నైజాంకు వ్యతిరేకంగానే కాకుండా, ఎక్కడ అసమానతలున్నా కాళోజి సహించేవారు కాదన్నారు. అలాంటి మహనీయుని స్మరించుకుంటూ జయంతి వేడుకలు జరుపుకోవడం సంతోషకరమైన సందర్భం అన్నారు.

ఈ కార్యక్రమంలో అరసం రాష్ట్ర ఉపాధ్యక్షులు బ్రహ్మాచారి, అరసం జిల్లా అధ్యక్షులు బిక్షపతి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ మార్క శంకర్ నారాయణ, కవులు, రచయితలు డాక్టర్ కె. వెంకట్, డాక్టర్ కాసర్ల రంగారావు, నరేందర్ రెడ్డి, అధ్యాపకులు, రాజేంద్రప్రసాద్, సువర్ణ వేణి, తిరుపతి, శోభారాణి, ఎస్.కె సమీనా, డాక్టర్ వేణు మాధవి, సంధ్యారాణి, బోధనేతర సిబ్బంది రజిత, అనిల్ కుమార్, వనమాల రమ, ఇద్దమ్మ, ఉమారాణి, రాజు, శారదా, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బందెల దొడ్డి స్థలాన్ని ఆక్రమించాలనుకోవడం నేరం

**- పర్వతగిరి మండలం వడ్లకొండ గ్రామపంచాయతీ**




వరంగల్, సెప్టెంబర్ 9,(జర్నలిస్ట్ వార్త): పర్వతగిరి మండలం వడ్లకొండ గ్రామపంచాయతీ పరిధిలోని బందెల దొడ్డి స్థలాన్ని ఆక్రమించాలనుకోవడం నేరమని గ్రామపంచాయతీ సిబ్బంది ఓ ప్రకటన విడుదల చేశారు. సోమవారం గ్రామపంచాయతీ సమాచారం మేరకు బందెల దొడ్డి స్థలం పూర్వం నుంచి నేటి వరకు గ్రామపంచాయతీ ఆధీనంలో ఉందని తెలిపారు. బందెల దొడ్డి స్థలాన్ని వడ్లకొండ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు గ్రామపంచాయతీ అనుమతి లేకుండా బందెల దొడ్డి స్థలంలో నిర్మాణ ప్రయత్నాలు చేశారని వివరించారు. ఈ క్రమంలో వడ్లకొండ గ్రామపంచాయతీ రికార్డుల ప్రకారం బందెల దొడ్డి స్థలం గ్రామపంచాయతీ కార్యాలయానికి చెందిన స్థలం అన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు బందెల దొడ్డి స్థలాన్ని స్వాధీనం చేసుకోబడిందన్నారు. గ్రామపంచాయతీ రికార్డు ప్రకారం 2/23/2 బందెల దొడ్డి ఇంటి నెంబర్ అన్నారు. ఈ స్థలాన్ని ఆక్రమించాలని చూస్తే, వారిపై పంచాయతీరాజ్ చట్టం 2018 సెక్షన్ 97(2) ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోబడునని హెచ్చరించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయం వడ్లకొండ సిబ్బంది బందెల దొడ్డి స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

# నాలుగు రోజులు ఆర్.ఎం.పి, పి.ఎం.పి వైద్య సేవలు బంద్

**- పర్వతగిరి మండల ప్రజలు సహకరించాలి: ఆర్ఎంపీ అధ్యక్షులు ఏకాంబ్రం**



పర్వతగిరి, సెప్టెంబర్ 9,(జర్నలిస్ట్ వార్త): పర్వతగిరి మండల కేంద్రంలోని అన్ని గ్రామాల ఆర్ఎంపి, పి.ఎం.పిలపై దాడులను నిరసిస్తూ, నాలుగు రోజుల పాటు మండల పరిధిలో వైద్య సేవలు నిలిపివేస్తున్నట్లుప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్ఎంపి పి.ఎం.పిలపై ఐఎంఏ, డిఎంహెచ్ఓ దాడులను నిరసిస్తూ, తెలంగాణ ఆర్ఎంపి, పిఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ వరంగల్ జిల్లా ఆదేశాల మేరకు ఈ నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. నాలుగు రోజుల పాటు కొనసాగనున్న వారి న్యాయపరమైన పోరాటానికి పర్వతగిరి మండల ప్రజలు సహకరించాలని పర్వతగిరి మండల ఆర్ఎంపి పి.ఎం.పి అసోసియేషన్ అధ్యక్షులు జి. ఏకాంబ్రం కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ఆర్.ఎం.పి పి.ఎం.పిలకు శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్ అందజేసేలా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. కరోనా సమయంలో ప్రాణాలు సైతం లెక్క చేయకుండా, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ధైర్యాన్నిచ్చి, ప్రాథమిక వైద్యాన్ని అందించామని వివరించారు. అదే కరోనా సమయంలో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు అందించే క్రమంలో కొంతమంది ఆర్ఎంపీలు తమ ప్రాణాలను సైతం కోల్పోయారని గుర్తు చేశారు. వైద్య సేవలు అందించడం తప్ప, మరో పనిపై దృష్టి పెట్టకుండా వైద్యవృత్తినే నమ్ముకుని, లక్షల కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని తెలిపారు. ఇప్పటికైనా ఆర్ఎంపి పి.ఎం.పిల కుటుంబాలపై అదృష్ట సారించి, సర్టిఫికెట్ అందించి వారిని ఆదుకోవాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో పర్వతగిరి మండల వెల్ఫేర్ ఆర్ఎంపీ పి.ఎం.పి వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, ఆర్ఎంపీలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్బిఐ బ్యాంక్ పార్కింగ్ ప్లేస్ ఎక్కడ..?

## - హైవే రోడ్డుపై నిలిపివేస్తున్న కస్టమర్ల వాహనాలు

**- రాకపోకల మధ్య ప్రయాణికుల ఇబ్బందులు - పట్టించుకోని సంబంధిత అధికారులు**




వర్ధన్నపేట, సెప్టెంబర్ 9,(జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట పట్టణ కేంద్రం బస్టాండ్ సమీపంలోని ఎస్బిఐ బ్యాంకు పార్కింగ్ ప్లేస్ ఎక్కడ ఉందో ఎవరికి తెలియని పరిస్థితి చోటు చేసుకుంది. పార్కింగ్ ప్లేస్ బ్యాంకు యాజమాన్యం గుర్తించకపోవడంతో కష్టమర్లంతా తమ వాహనాలను వరంగల్, ఖమ్మం హైవే రోడ్డుపైనే నిలిపి వేస్తున్నారు. ఒక రకంగా చెప్పాలంటే బ్యాంకు కస్టమర్ల వాహనాలు నిలిపివేయడంతో సగం రోడ్డు ఆ వాహనాలకే సరిపోతుంది. ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ కార్యచరణ అమలులోకి తీసుకువచ్చింది. దీంతో బ్యాంకు కస్టమర్ల సంఖ్య మరింత ఎక్కువగా పెరిగిపోయింది. ఇతరత్రా గ్రామాల నుంచి వస్తున్న కస్టమర్లు వారి వాహనాలను నిలిపివేయడానికి మరోచోట అవకాశం లేక, బ్యాంకు ముందు హైవే రోడ్డుపై నిలిపివేయడంతో పాటు బస్టాండ్ ఆవరణం వాడుకుంటున్నారు. ఆ కారణంగా రహదారిపై వాహనాలు నిలిపివేయడంతో ఇతరత్రా వాహనదారుల ప్రయాణానికి ఆటంకం ఏర్పడుతున్నట్లు తెలుస్తోంది. మరో సమస్య ఏంటంటే ఆర్టీసీ బస్సు బస్టాండ్ నుండి వరంగల్ వైపు వెళ్లాలంటే, బస్సు డ్రైవర్ నిదానంగా, కొంతమంది బైకులు పక్కకు తీయించి, మరీ సురక్షితంగా డ్రైవింగ్ చేయాల్సిన పరిస్థితి అక్కడ చోటు చేసుకుంది. ఒకవేళ ఎస్బిఐ బ్యాంకు వారికి పార్కింగ్ ప్లేస్ ఎక్కడైనా ఉంటే, సూచన చేస్తూ, కస్టమర్ల వాహనాలను దారి మళ్ళించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేదంటే ఆ సమీపంలో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో, తెలియని ప్రమాదకర పరిస్థితులు పొంచి ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్డుపై ప్రయాణం చేస్తున్న వాహనదారులకు ఏర్పడుతున్న ఇబ్బందులపై దృష్టి సారించి, ఉపశమనం కల్పించాలని వాహనదారులు కోరుతున్నారు.

# కుక్కల దాడిలో గాయపడ్డ బాలుడు

**- అధికారులు ఇంకెప్పుడు చర్యలు తీసుకుంటారు..?**



**వరంగల్, సెప్టెంబర్ 9,(జర్నలిస్ట్ వార్త):** కుక్కల దాడి రోజు రోజుకు పెరిగిపోతుంది. ముక్కుపచ్చలారని పసికందులు కుక్కల దాడిలో గాయాలపాలై ఆసుపత్రుల పాలౌతున్నారు. వివరాల్లోకి వెళితే పర్వతగిరి మండలం వడ్లకొండ గ్రామంలో మోడం శివ కుమారుడు మోడం అక్షిత్ 7 సంవత్సరాలు అనే యువకుడు ఇంటి ముందు ఆడుకుంటుండగా వీధి కుక్కలు ఆ బాలుడిపై దాడి పాల్పడ్డాయి. కుటుంబ సభ్యులతో పాటు ఇరుగు పొరుగు వారు బాలుడు పై దాడికి పాల్పడిన కుక్కలను తరిమికొట్టారు. అసలే మండల పరిధిలోని ఆర్ఎంపీ డాక్టర్లు వైద్య సేవలు బంద్ పెట్టారు. ఇరుగు పొరుగు వారి సహకారంతో బాలుడు స్వల్ప గాయాలతో బయటపడగా బాలుడి తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. ఇలా కుక్కలు, కోతుల దాడికి గురై చాలా మంది చిన్నారులు బడికి వెళ్లాలన్నా, ఇంటి సమీపంలో ఆడుకోవాలన్నా భయపడాల్సిన పరిస్థితి చోటు చేసుకుంది. ఇట్టి విషయమై స్థానిక అధికారులు, పాలకులతో ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేకపోయిందని ఆవేదన చెందుతున్నారు. ఇలాంటి పరిస్థితి మరెక్కడ పునరావృతం కాకుండా ఇప్పటికైనా అధికారులు సరైన చర్యలు చేపట్టాలని బాధితులు కోరుతున్నారు.



# పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల కోసం ఆన్ లైన్ లో దరఖాస్తులు

**- అర్హులైన దివ్యాంగ విద్యార్థులంతా దరఖాస్తు చేసుకోవాలి**

**- జిల్లా సంక్షేమ శాఖ అధికారి జే. హైమావతి**

వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 9,(జర్నలిస్ట్ వార్త):
వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఇంటర్, ఆపై విద్యనభ్యసిస్తున్న దివ్యాంగులైన విద్యార్థుల నుంచి పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల కోసం, ఆన్ లైన్ లో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి జే. హైమావతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను, పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల కోసం ఫ్రెష్, రెన్యువల్ దరఖాస్తులు 31వ, తేదీ డిసెంబర్ లోగా చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం వరంగల్ జిల్లా లోని అర్హులైన దివ్యాంగ విద్యార్థులంతా **http://telanganaepass.cgg.gov.in** వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి సూచించారు.

# రాష్ట్రస్థాయి ప్రజావాణి కార్యక్రమం బుధవారానికి వాయిదా

**- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి**



వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 9,(జర్నలిస్ట్ వార్త): హైదరాబాద్ మహాత్మా బాపురావు పూలే ప్రజా భవన్ లో మంగళవారం (ఈ నెల 10వ, తేదీన) జరిగే రాష్ట్ర స్థాయి ప్రజావాణి కార్యక్రమం బుధవారానికి వాయిదా వేసినట్లు సోమవారం వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి ఓ ప్రకటన ద్వారా తెలిపారు. హైదరాబాద్ ప్రజాభవన్ లో 16వ, ఆర్థిక సంఘం సమావేశాలు జరుగుతున్నందున, మంగళవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమం బుధవారానికి వాయిదా వేసినట్లు తెలుపుతూ, ఈ మార్పును వరంగల్ జిల్లా ప్రజలు గమనించాలని కలెక్టర్ కోరారు.

# చాకలి ఐలమ్మ వర్ధంతి ఉత్సవాలు అధికారికంగా నిర్వహించుటకు ఉత్తర్వులు జారీ

**- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి**

వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 9,(జర్నలిస్ట్ వార్త): చాకలి ఐలమ్మ వర్ధంతి ఉత్సవాలను తెలంగాణ ప్రభుత్వం అధికారికముగా నిర్వహించాలని ఉత్తర్వులు జారి చేసినట్లు, సోమవారం వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఐలమ్మ విగ్రహం న్యూ శ్యాంపేట్, హనుమకొండ బి.సి సంక్షేమ శాఖ ఆధ్వర్యములో తేది.10. 9.2024 ఉదయం 10 గంటలకు నిర్వహించడం జరుగుతుందన్నారు. అందువల్ల ప్రజా ప్రతినిధులు, అధికారులు, కులసంఘాల నాయకులు, ప్రజలందరూ చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమములో పాల్గొని విజయవంతం చేయగలరని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

